సాక్షి సంగారెడ్డి

సోమవారం । 4 । మార్చి । 2024



ఒంటికొస్తే ఇంటికే..

ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. దుబ్బాక అంగడికి వచ్చే ప్రజలు మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు... వివరాలు 8లో ▸



పంటను తగులబెట్టిన రైతు

చెరకు పంటను తరలించేందుకు దారి ఇవ్వడం లేదన్న ఆవేదనతో ఓ రైతు తాను పండించిన పంటనే దహనం చేసుకున్నాడు.

వివరాలు 8లో ▸

జిల్లాలో డ్రోన్లపై నిషేధం

సంగారెడ్డి టౌన్: ప్రధాని మోదీ జిల్లా పర్యటన నేపథ్యంలో ఆకాశంలో ఎలాంటి రిమోట్ కంట్రోల్ డ్రోన్లు ఎగురవేయవద్దని కలెక్టర్ క్రాంతి ఒక ప్రకటనలో ఆదేశించారు. 4, 5వ తేదీలలో వీటి పై నిషేధం కొనసాగుతుందని ఆమె తెలిపారు. మోదీ సభకు రెండు కిలోమీటర్ల మేర రెడ్ అలర్ట్ విధిస్తున్నట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

మహిళలకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు స్వయం ఉపాధి కల్పన కోసం బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మహిళలకు ఈ నెల 11నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్ కిట్టు, సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులు అని చెప్పారు. ఆసక్తి గలవారు సంగారెడ్డి బైపాస్‌లోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాల కోసం 9704446956, 9490129839లో సంప్రదించాలన్నారు.

విజయ సంకల్ప సభకు ఏర్పాట్లు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ బీబీ పాటిల్

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 5వ తేదీన జరగనున్న విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్‌చెరు శివారు, పటేల్‌గూడ సమీపంలో సభ ఏర్పాట్లను ఆయన బీజేపీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధాని మోదీ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రాష్ట్ర నాయకులు అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, నాగసాని నరేష్, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

13న తైబజార్ వేలం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 13న మధ్యాహ్నం 2:30 గంటలకు 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ తైబజార్, మేకల బజార్, ఎడ్ల బజార్, పెద్దమాంసం, చిన్నమాంసం విక్రయాలకు వేలంపాట నిర్వహించనున్నట్లు కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నిబంధనల ప్రకారం డిపాజిట్‌ను చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: తాను పార్టీ మారుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తనకు కేసీఆర్ నాయకత్వంపై పూర్తి నమ్మకం ఉందన్నారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టినప్పటి నుంచి బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెప్పారు. 2014లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓడినా.. కేసీఆర్ తనపై ఉన్న నమ్మకంతో 2019, 2023లో టికెట్ ఇచ్చి గెలిపించారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని చెప్పారు. తప్పుడు ప్రచారాలను కార్యకర్తలు నమ్మొద్దని సూచించారు.

మెదక్ పార్లమెంట్‌లో కాంగ్రెస్‌దే విజయం



గణపతి ప్రతిమను అందజేస్తున్న నీలం

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి గణపతి ప్రతిమ, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతం చేస్తూ మెదక్ పార్లమెంటులో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సూచించినట్లు నీలం తెలిపారు.

● చూడ చక్కగా.. చల్లగా


మట్టి కుండలోని చల్లని నీటికి ఏ శీతల పానీయాలు సరితూగవు. వేసవిలో దాహం తీరాలంటే ఈ పేదోడి ఫ్రిజ్ నీరు ఒక్క గ్లాస్ తాగితే చాలు కడుపు చల్లపడుతది. అంతే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మంచిది కూడా. భానుడు భగ్గుమంటుడటంతో సంగారెడ్డి పట్టణంలో మట్టికుండల విక్రయాలు జోరందుకున్నాయి. వివిధ రకాల ఆకృతిలో వాటిని తయారు చేసి అమ్ముతున్నారు. మట్టి జగ్గులు, గ్లాసులు, కప్పులు సైతం లభిస్తున్నాయి.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



సంగారెడ్డిలో అమ్మకానికి అందుబాటులో ఉంచిన మట్టి కుండలు





మట్టి బాటిల్, కూజా

గ్రేటర్‌లోకి మున్సిపాలిటీలు ?



బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారి

- ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీలను గ్రేటర్‌లో కలిపే దిశగా ప్రభుత్వం అడుగులు
- సాధ్యాసాధ్యాలపై అధికారుల కసరత్తు
- నాయకుల రాజకీయ భవిష్యత్ ప్రశార్థకం

జిన్నారం(పటాన్‌చెరు): ఔటర్ రింగ్ రోడ్డు లోపలి కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి వెళ్లనున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలు గ్రేటర్‌లో కలుస్తాయని నాయకులు, అధికారుల్లో చర్చ మొదలైంది. అదే జరిగితే మున్సిపాలిటీలు పోయి కార్పొరేషన్‌లు రానున్నాయి. మున్సిపాలిటీలపై ఆశలు పెట్టుకున్న నాయకుల పరిస్థితి ఏమిటనే చర్చ జరుగుతుంది.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ హైదరాబాద్ పరిధిలోని ఏడు కార్పొరేషన్లు, 30మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీన చేస్తే జరిగే పరిణామాలు, తదితర విషయాలపై అధ్యయనం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఈ విషయమై తగిన నివేదికను అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆ శాఖకు సూచించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొల్‌్రాం, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలు ఓఆర్ఆర్ లోపల ఉన్నాయి. కాగా ఈ మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీన చేసే విషయమై అధికారులు కసరత్తును ప్రారంభించారు. ఇక్కడి జనాభా, మౌళిక వసతులు, జరుగుతున్న అభివృద్ధితో పాటు ఈ ప్రాంతాలు గ్రేటర్ పరిధిలోకి వెళ్తే కలిగే ప్రయోజనం తదితర సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలిస్తున్నారని తెలిసింది. మున్సిపల్ చైర్మన్ల పదవీకాలం ఏడాదిలో ముగియనుంది. ఆ తర్వాత ప్రత్యేక అధికారులను నియమించి ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోనుందని తెలిసింది. మరో ఏడాదిలోపు ఏం జరుగుతుంతో, ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

నిరాశలో నేతలు

ఒకవేళ మున్సిపాలిటీలు గ్రేటర్‌లో కలిస్తే మాత్రం ఈ ప్రాంత నాయకుల ఆశలు అడియాసలు అవుతాయి. బొల్లారం మున్సిపల్ పరిధిలో సుమారు 30వేలు, అమీన్‌పూర్ పరిధిలో సుమారు 50 వేలు, తెల్లాపూర్ పరిధిలో సుమారు 40 వేల వరకు జనాభా ఉంటుంది. ఈ లెక్కల ప్రకారం గ్రేటర్ పరిధిలోని కార్పొరేటర్‌ల ఎన్నిక ఉంటుంది. దీంతో మూడు మున్సిపల్ పరిధిలో కేవలం పదిమంది నాయకులు మాత్రమే కార్పొరేటర్లు అయ్యే అవకాశం ఉంటుంది. ఇంత పెద్ద మున్సిపాలిటీల్లో రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందని నాయకులు, ప్రజలు విశ్లేషిస్తున్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు



జోగిపేటలో పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి దామోదర

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర

జోగిపేట(అందోల్): పోలియో చుక్కలు వేయించడం ద్వారా చిన్నారుల నిండుజీవితం ఆనందమయంగా ఉంటుందని, ఈ విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయొద్దని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి మంత్రి మాట్లాడారు. పోలియో చుక్కలు వేయించడం వల్ల ఈ వ్యాధి బాధితుల సంఖ్య చాలా వరకు తగ్గిందన్నారు. వంద శాతం పోలియో చుక్కలు వేసేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు చేసిన విషయం ప్రతిపక్షాలు గమనించాలన్నారు. 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కూడా ప్రారంభించబోతున్నామని తెలిపారు. జోగిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమంలో మంత్రి దామోదర్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అలాగే పట్టణంలోని లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లును అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రికి ఎంఆర్ఎఫ్ కంపెనీ కేటాయించిన అంబులెన్స్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఆర్.చంద్రశేఖర్, డీఎంహెచ్ఓ గాయత్రీదేవి, చైల్డ్ హెల్త్ డైరెక్టర్ సుధీర, డీసీహెచ్ఎస్ సంగారెడ్డి, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ శ్రీనాథ్, చైల్డ్ హెల్త్ రాష్ట్ర అధికారి భానుకిరణ్, డబ్ల్యూహెచ్ఓ సందీప్ పాటిల్, డీఐఓ శశాంక్ దేశ్‌పాండే, యునిసెఫ్ కన్సల్టెంట్ రవినాయుడు, ప్రోగ్రాం అసిస్టెంట్ శ్రీధర్, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రమేశ్, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఆర్డీఓ పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి పాల్గొన్నారు.

97.6 శాతం పల్స్ పోలియో

సంగారెడ్డి: జిల్లాలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మొత్తం 1,137 కేంద్రాలు, 38 మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేసి లక్షా 31వేల 67 మంది ఐదేళ్ల లోపు చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు వైద్యశాఖ పేర్కొంది. 4548 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు భాగస్వామ్యమయ్యారు.

నేడు 'పేట' చైర్‌పర్సన్ ఎన్నిక



సదాశివపేట మున్సిపల్ కార్యాలయం దృశ్యం

- మళ్లీ బీఆర్ఎస్ పార్టీకే చాన్స్
- అపర్ణపాటిల్ ఎన్నికయ్యే అవకాశం

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నికను అధికారులు సోమవారం నిర్వహించనున్నారు. 2018లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 26వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ 13 స్థానాల్లో గెలిచి బీఆర్ఎస్ పీఠాన్ని దక్కించుకుంది. మున్సిపల్ చైర్ పర్సన్‌గా పిల్లోడి జయమ్మ ఎన్నికయ్యారు. గత నెల 9వ తేదీన జయమ్మపై పెట్టిన అవిశ్వాసం 22 కౌన్సిలర్ల మద్దతో నెగ్గిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతం 20 మంది కౌన్సిలర్ల బలం ఉంది. ఎన్నికల కమిషన్ ఈనెల 4వ తేదీన కొత్త మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సంగారెడ్డి ఆర్డీఓ వసంతకుమారి ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. నూతన చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణపాటిల్ ఎన్నికయ్యే చాన్స్ ఉంది. ఈమె కూడా బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్. అపర్ణపాటిల్ సొంత పార్టీ బీఆర్ఎస్ తోపాటు బీజేపీ, ఎంఐఎం పార్టీల 19 మంది కౌన్సిలర్ల మద్దతు కూడగట్టారు.

కరుణించు.. కరుణామయా



చర్చిలో భక్తుల ప్రార్థనలు

మెదక్: పట్టణంలోని సీఎస్ఐ చర్చికి ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు దైవసందేశం ఇచ్చారు. కాగా దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అక్కన్నపేటలో ఆగని రైళ్లు

అజంతా, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు నో హాల్టింగ్

రామాయంపేట(మెదక్): జిల్లాలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్ అక్కన్నపేటలో అజంతా, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ గురించి కొన్నేళ్లుగా ప్రయాణికులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కామారెడ్డి- మేడ్చల్ మధ్య అతిపెద్ద స్టేషన్ ఇదే కావడంతో అత్యంత రద్దీ ఉంటుంది. ఆదాయపరంగా మిగితా రైల్వేస్టేషన్ల కంటే మెరుగే. కాగా తిరుపతి, షిరిడితో పాటు ఇతర పుణ్యక్షేత్రాలైన బాసర, నాందేడ్‌లోని గురుద్వార్ ఆలయానికి వెళ్లడానికి ఈస్టేషన్ నుంచి సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజూ అక్కన్నపేట స్టేషన్ మీదుగా తిరుపతి వెళ్లే రాయలసీమ, షిరిడి వెళ్లే అజంతా ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కోసం గతంలో గ్రామస్తులతో పాటు ప్రయాణికులు పలుమార్లు రైల్‌రోకో నిర్వహించి కేసుల పాలై కోర్టుల చుట్టూ తిరిగారు. కాగా మెదక్, సిద్దిపేట, ఇతర నగరాల నుంచి పుణ్యక్షేత్రాలకు వెళ్లడానికి ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు కామారెడ్డి రైల్వేస్టేషన్‌కు వెలుతున్నారు. ఈవిషయమై బీజేపీ నాయకులు ఢిల్లీ వెళ్లి అప్పటి రైల్వేమంత్రి సురేశ్‌ప్రభుకు వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.



అక్కన్నపేట రైల్వేస్టేషన్

బకాయి వసూళ్లకు ఓటీ'ఎస్'

- ఆస్తి పన్ను ఒకేసారి చెల్లిస్తే 90శాతం వడ్డీ రాయితీ
- మున్సిపాలిటీల్లోనే అవకాశం
- ఈ నెల 31వ చివరి గడువు

జోగిపేట(అందోల్): మున్సిపాలిటీల్లో పేరుకుపోయిన బకాయిలను వసూలు చేసేందుకు ప్రభుత్వం మరోసారి వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)కు అవకాశం కల్పించింది. దీని ద్వారా ఆస్తిపన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.దానకిశోర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలో వేలాది మంది బకాయిదారులకు ఊరట కలగనుంది. సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, అందోల్-జోగిపేట, నారాయణఖేడ్, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మొత్తం 8 మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిలో 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు రూ.కోట్ల మేర ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. వీటిపై ఏటా నానాటికీ వడ్డీ పెరుగుతూ వస్తుంది. ఈ మేరకు పన్ను మొత్తం ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 90 శాతం రాయితీ వర్తించనుండటంతో బకాయిదారులు కూడా ముందుకు వచ్చే అవకాశాలున్నాయి.



అందోలు-జోగిపేట మున్సిపాలిటీ కార్యాలయం

ఈ నెల 31వరకు గడువు

ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం రాయితీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో చెల్లింపులకు బకాయిదారులు ముందుకు వస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు చివరి తేదీ కావడంతో కేవలం 10 శాతం వడ్డీ కడితే సరిపోతుంది. దీంతో ఎక్కువ మొత్తంలో బకాయిలు వసూలయ్యే అవకాశం ఉంది. అయితే ఈసారి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఉన్నతాధికారులు సూచనలు చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వంద శాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

నెలాఖరులోగా బకాయిలు చెల్లించండి



పేరుకుపోయిన బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ రాయితీని కల్పించింది. ఈ విధానం 3వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో రూ.1.44 కోట్ల ఆస్తిపన్ను బకాయిలుండగా, రాయితీ మినహాయిస్తే కేవలం రూ.65 లక్షలు మాత్రమే ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉంది. ఈ నెల 31వ తేదీలోగా చెల్లించినట్లయితే కేవలం 10 శాతం వడ్డీ మాత్రమే కార్యాలయంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకొవాలి.

– తిరుపతి, మున్సిపల్ కమిషనర్, అందోల్–జోగిపేట

కొమురవెల్లి క్షేత్రం.. భక్తజన సంద్రం



స్వామివారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడోవారమైన ఆదివారం అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. వరంగల్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు నగరం నుంచి సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి నుంచే మొదలైన భక్తుల రాక ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. భక్తులు కోనేటిలో పవిత్ర స్నానాలు ఆచరించి క్యూలైన్ల ద్వారా స్వామి వారి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు.

వనమంతా జనం.. దుర్గమ్మకు నీరాజనం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనమంతా ఆదివారం భక్తులతో నిండిపోయింది. ఉదయం నుంచే దుర్గమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారికి బోనాలు తీసి ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం చెట్ల కింద విందు చేసుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ బాలాగౌడ్ ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ డాక్టర్ భీమా

నర్సాపూర్: సీఎస్‌బీఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ భీమాకు విద్యార్థి మెంటర్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ఉత్తమ అధ్యాపకుడిగా జాతీయ అవార్డు లభించినట్లు బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్ దూబె తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సొసైటీ నిర్వహించిన జాతీయ స్థాయి పురస్కారాల్లో భాగంగా అవార్డు వచ్చింది.

దేశ విచ్ఛిన్నానికి యత్నిస్తే ఊరుకోం

హత్నూర (సంగారెడ్డి): దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చూస్తూ ఊరుకోదని ఆ సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల క్షేత్ర ప్రచార ప్రముఖ్ గొట్టుముక్కుల భాస్కర్ అన్నారు. ఆదివారం హత్నూర గ్రామ శివారులో నిర్వహించిన ఈశ్వరపురం కండ శాఖ సంఘి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ప్రారంభమై నేటికీ 99 ఏళ్లు పూర్తయ్యాయని, ఈ సంఘం ఎందరినో దేశ భక్తి గల పౌరులను, ఇద్దరు ప్రధానమంత్రులు అందించిందన్నారు. ఇక్కడ ఎలాంటి కుల మత విభేదాలు ఉండవని పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్డేటి భూమేష్ విభాగ్ ప్రచారక్, జిల్లా శారీరక్ ప్రముఖ్ రామంతపురం విష్ణువర్ధన్ రెడ్డి, జక్కుల శివకుమార్, కాసుల రవీంద్రనాథ్ శర్మ పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

కంగ్టి(నారాయణఖేడ్): నారాయణఖేడ్ ఎక్సైజ్ అధికారులు ఆదివారం అక్రమ మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. కంగ్టి మండలం సిద్దంగిర్గాలో పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం మద్యం అమ్ముతున్నట్లు సమాచారంతో నారాయణఖేడ్ ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకొన్నారు. దాడిలో 2.16 లీటర్ల ఐఎంఎల్, 5.85 లీటర్ల బీరు, 4 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ ఉద్యో గం సాధించాలని ప్రతి ఒక్కరూ నిరంతరం కష్టపడుతుంటారు. కానీ మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన గుండ్రెరెడ్డి మహిపాల్‌రెడ్డికి ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మర్మాముల గ్రామానికి చెందిన మహిపాల్ ఒక వైపు ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. ఇటీవల విడుదల చేసిన గురుకుల ఫలితాలలో ఒకేసారి జూనియర్ లెక్చరర్ కామర్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ ఉద్యోగాలకు ఎంపియ్యారు.

ఒంటికొస్తే ఇంటికే..

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్లు

- దుబ్బాక అంగడి బజారులో అధ్వానం
- నిర్వహణ లోపంతో వెదజల్లుతున్న దుర్గంధం
- అవస్థలు పడుతున్న ప్రజలు, దుకాణదారులు



దుబ్బాకలో మహిళల కోసం ఏర్పాటు చేసిన షీ టాయిలెట్లు



టాయిలెట్ల లోపల పేరుకుపోయిన చెత్తాచెదారం

దుబ్బాక: ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. దుబ్బాక పట్టణంలోని అంగడి బజార్‌లో రద్దీని దృష్టిలో పెట్టుకొని అధికారులు పురుషులు, స్త్రీల కోసం వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేశారు. తర్వాత వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. నిర్మించినవి కూడా సరిపడా లేకపోవడంతో వినియోగించుకోవడం లేదు. దుకాణ సముదాయంలో గల వ్యాపారులు, అక్కడికి వచ్చే వినియోగదారులు, కూరగాయల అంగడికి వచ్చే ప్రజలు మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకుంది.

రూ.15 లక్షలు వెచ్చించి..

పట్టణంలోని అంగడి బజార్‌లో రూ.15 లక్షలు ఖర్చు వెచ్చించి. 2021 సంవత్సరంలో నిర్మించిన టాయిలెట్లు వృథాగా మారాయి. వాటి నిర్వహణపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ప్రజలు మండిపడుతున్నారు. దుబ్బాకలోని శానిటరీ పర్యవేక్షణ అధికారి నిర్లక్ష్యంగా ఎందుకు వహిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అలాగే అంగడి బజార్ చుట్టుపక్కల దాదాపు 15 పైగా దుకాణ సముదాయాలు ఉంటాయి. వారంతా మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించి టాయిలెట్లను వాడుకలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కేవలం రెండు చోట్లే..

నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాక పట్టణంలో కేవలం రెండు చోట్ల మాత్రమే పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. బస్టాండ్, అంగడి బజారులో మాత్రమే పబ్లిక్ టాయిలెట్లు నిర్మించారు. బస్టాండ్‌లో రద్దీకి సరిపడా టాయిలెట్లు లేవు. ఇక అంగడీ బజారులో నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. పట్టణంలో మరి కొన్ని ప్రదేశాల్లో టాయిలెట్లను ఏర్పాటు చేసి వాటిని పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

నిత్యం రద్దీగా ఉండే దుబ్బాక అంగడి బజారులో టాయిలెట్లు నిర్మించి వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మూత్ర విసర్జన చేయడానికి పట్టణ శివారులోకి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి టాయిలెట్లను వాడుకలోకి తీసుకురావాలి. –స్వామి , దుబ్బాక

వాడుకలోకి తీసుకొస్తాం

దుబ్బాకలోని అంగడి బజారులో ఉన్న టాయిలెట్లను శుభ్రపరిచి వీలైనంత త్వరగా వాడుకలోకి తీసుకొచ్చి సమస్యను పరిష్కరిస్తాం. ఎప్పటికప్పుడూ శుభ్రం చేయిస్తాం. ప్రజలు సైతం టాయిలెట్లలో చెత్తాచెదారం, వేయడం, టాయిలెట్లను ధ్వంసం చేయడం మానుకోవాలి. పర – రమేశ్ కుమార్ , దుబ్బాక మున్సిపల్ కమిషనర్

పండించాడు.. తగులబెట్టాడు

- దారి ఇవ్వడం లేదని చెరకు రైతు ఆవేదన
- రూ.4 లక్షలు వరకు నష్టం

కౌడిపల్లి మండలం సదాశివపల్లిలో ఘటన



చెరకు తోటను దహనం చేసుకుంటున్న రైతు కృష్ణాగౌడ్



దారి లేకుండా తవ్వేసిన చెరువు కట్ట

కౌడిపల్లి(నర్సాపూర్): తాను పండించిన చెరకు తోటను తరలించేందుకు దారి ఇవ్వడం లేదన్న ఆవేదనతో రైతు పంటను దహనం చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని సదాశివపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు నాయిని కృష్ణాగౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు కృష్ణాగౌడ్ సదాశివపల్లి కనికల చెరువు కట్ట కింద 2.20 ఎకరాల భూమిలో చెరుకు తోట సాగు చేస్తున్నాడు. పంట కోతకు రాగా కొంత నరికి కుప్పలు చేశాడు. చెరకు తరలించేందుకు కట్ట పైనుంచి ఉన్న దారిని గ్రామస్తులు ధ్వంసం చేసి దారిలేకుండా చేశారు. పోలీసులు, ఐబీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్ఐ వచ్చి పరిశీలించి వెళ్లారని కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ క్రమంలో రెండేళ్లుగా దారి విషయంతో గొడవలు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన చెందిన రైతు సుమారు రూ.4 లక్షల విలువ చేసే పంటను దహనం చేశాడు.

మాజీ సర్పంచ్, గ్రామస్తులు కుట్రలు చేస్తున్నారు : రైతు కృష్ణాగౌడ్

తన భూమిపై మాజీ సర్పంచ్‌తోపాటు గ్రామస్తులు కుట్రలు చేస్తున్నారు. చెరకు పంటను తరలించేందుకు దారి లేకుండా చేశారు. ఇదే విషయం అడిగితే రూ.10 వేలు డిపాజిట్ చేసి కట్ట పైనుంచి దారి వేసుకొని చెరుకు పంట తరలించగానే మళ్లీ దారి తీసివేయాలని చెబుతూ మాజీ సర్పంచ్‌తోపాటు గ్రామస్తులు ఇబ్బంది పెడుతున్నారు. చెరుకు ఫ్యాక్టరీ సైతం బంద్ అవుతుందని దీంతో చేసేదిలేక పంటను తగులబెట్టిన. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

పాప సేఫ్..

- కిడ్నాప్ చేసిన మహిళ అరెస్టు
- రాష్ట్ర సరిహద్దులు దాటుతుండగా పట్టుకున్న పోలీసులు
- తల్లిదండ్రులకు అప్పగింత



కిడ్నాప్‌కు గురైన పాప



పోలీసు అదుపులో సహనాజ్‌ఖాన్

జహీరాబాద్ టౌన్: హైదరాబాద్‌లో కిడ్నాప్‌కు గురైన పాపను పోలీసులు కాపాడి పాప తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం కిడ్నాప్ చేసిన మహిళను అరెస్ట్ చేశారు. జహీరాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. సహనాజ్‌ఖాన్ అనే మహిళ హైదరాబాద్‌లోని మాదన్నపేటలో ఓ ఇంటిలో పని మనిషిగా చేరింది. అదును చూసుకొని యజమాని కూతురు అమ్రా సిద్దిఖి అనే 9 నెలల పాపను కిడ్నాప్ చేసింది. పాప కిడ్నాప్‌కు గురికావడంతో తల్లిదండ్రులు మాదన్నపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు కిడ్నాపర్ ఆచూకీ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఎంజీబీఎస్ బస్టాండ్‌లో సీసీ కెమెరాలను పరిశీలించగా పాపను ఎత్తుకెళ్లిన మహిళ జహీరాబాద్ బస్సు ఎక్కినట్లు గుర్తించారు. వెంటనే మాదన్నపేట పోలీసులు జహీరాబాద్ పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. డీఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ లక్ష్మారెడ్డి, పోలీసులు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు వెళ్లే బస్సులను తనిఖీ చేశారు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో మహారాష్ట్ర బస్సులో కిడ్నాపర్, పాపాను పోలీసులు గుర్తించారు. వెంటనే మహిళను అదుపులోకి తీసుకొని మాదన్నపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. జహీరాబాద్‌కు చేరుకున్న పోలీసులు పాపను తల్లిదండ్రులకు అప్పగించి కిడ్నాపర్‌ను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని చైతన్య నగర్ కాలనీకి చెందిన కొండకల్ పుల్లారెడ్డి (75) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల కిందట భార్య మృతి చెందడంతో అప్పటి నుంచి మనస్తాపానికి గురవుతున్నాడు. ఈ క్రమంలోనే శనివారం వ్యవసాయ పొలంలో జీఎంఆర్ ఫంక్షన్ హాల్ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కూతురు మీన ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏసీ ఫిట్టింగ్ చేస్తుండగా..

- సీలింగ్ కూలి ఒకరు మృతి, మరొకరికి గాయాలు

ములుగు(గజ్వేల్) : పైకప్పు సీలింగ్ కూలి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ములుగు మండలం బండ తిమ్మాపూర్ గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, ముర్షిదాబాద్ జిల్లా సర్‌మస్తాపూర్ గ్రామానికి చెందిన ఎండీ.ముహిదుల్ ఇస్లాం(24), ఎస్‌కె భఫన్ ములుగు మండలం బండ తిమ్మాపూర్ గ్రామ శివారులోని కోకాకోలా కంపెనీలో కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం కంపెనీలో ఇద్దరూ ఏసీ ఫిట్టింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు సీలింగ్ కూలింది. ఈ ప్రమాదంలో ముహిదుల్‌కి తీవ్ర గాయాలు కాగా, భఫన్ కాలు విరిగింది. వెంటనే వీరి మేడ్చల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా ముహి దుల్ ఇస్లాం చికిత్స పొందుతూ మృతి చెందాడు.



ఇక్రిశాట్‌లో దిగుతున్న హెలికాప్టర్

హెలికాప్టర్‌ల ట్రయల్‌రన్..



సభా ప్రాంగణ వద్ద హెలికాప్టర్

పటాన్‌చెరు టైన్/రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ఈనెల 5వ తేదీన పటాన్‌చెరు మండలం పటేల్‌గూడలో ప్రధాని నరేంద్ర మోదీ సభ జరుగనుంది. ఈ సందర్భంగా జిల్లాలో ఆదివారం మూడు చాపర్లు (హెలికాప్టర్లు) దిగాయి. మధ్యాహ్నం 2:44 గంటలకు చాపర్ వచ్చి సభా ప్రాంగణం వద్ద దాదాపు 40 నిమిషాలు ఆగింది. అనంతరం చాపర్లు నిలిపే చోటు రామచంద్రాపురం పట్టణ పరిధిలోని ఇక్రిశాట్ వద్ద ట్రయల్ రన్ నిర్వహించాయి.

డబ్బులిస్తేనే పని..

- రోడ్డు విస్తరణ పనుల్లో సూపర్ వైజర్ చేతివాటం
- ఇష్టారాజ్యంగా చేస్తున్నాడని స్థానికుల ఆరోపణ



తొలగించిన నిర్మాణాలను చూపుతున్న షాదుల్లా

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి 365(బి) విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా డివైడర్‌కు ఇరువైపులా రోడ్డు స్థలంలో ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్నారు. తొలగించే పనులను దగ్గర ఉండి సూపర్‌వైజ్ చేస్తున్న కాంట్రాక్టర్‌కి చెందిన ఓ వ్యక్తి డబ్బులిచ్చిన వారికి అనుకూలంగా చేస్తున్నాడని, తొలగించిన నిర్మాణాల చోట తిరిగి మట్టి నింపేందుకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉంటే పట్టణ కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు షాదుల్లాకు స్థానిక అంగడి బజారులో షటర్లు ఉన్నాయి. రోడ్డు విస్తరణలో షటర్ల ముందున్న కొంత భాగం తొలగించాల్సి వచ్చింది. అరుగులు తొలగించే క్రమంలో మొత్తం పాడవకుండా తీయాలని షాదుల్లా సంబంధిత సూపర్ వైజర్‌ను కోరాడు. రూ.5 వేలు ఇస్తే తీస్తానని చెప్పడంతో రూ.2 వేలు ఇచ్చాడు. మిగితా డబ్బులు పని పూర్తయిన తర్వాత ఇస్తానని చెప్పి ఒప్పుకున్నాడు. మొత్తం అంతా ఒకేసారి ఇవ్వలేదన్న కారణంగా సూపర్ వైజర్ ఇష్టారాజ్యంగా తొలగించి నష్టం కలిగించాడని షాదుల్లా ఆరోపించాడు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి సూపర్ వైజర్‌పై చర్యలు తీసుకొని పట్టణ ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడే ప్రయత్నం చేయగా స్పందించలేదు.

భారీగా వాహనాలు పట్టివేత



బైక్‌లను చూపుతున్న పోలీసులు

తూప్రాన్: పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద ఆదివారం నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో నంబర్లు సరిగా లేని బైక్‌లను భారీగా పట్టుకున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. బైక్‌దారులు నంబరు ప్లేటు లేకుండా, సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్నందున సుమారు 50 వరకు పట్టుకున్నట్లు తెలిపారు. కొందరు చలాన్లు పడకుండా నంబర్ ప్లేట్లకు స్టిక్కర్లు వేసుకొని తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కారకులైన వారిని గుర్తించలేక సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ క్రమంలోనే ఇకపై వాహనదారులు సరైన ధృవపత్రాలతోపాటు నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పశుగ్రాసం.. పరేషాన్ వద్దు

శాస్త్రీయ పద్ధతుల్లో సాగు

- తీరనున్న పశుగ్రాసం కొరత
- మెలకువలు పాటిస్తే అధికంగా పాలు దిగుబడి
- పశు వైద్యాధికారి డాక్టర్ నాగార్జున





జహీరాబాద్ ప్రాంతంలో సాగు చేస్తున్న పశుగ్రాసం

జహీరాబాద్ టౌన్: పశుగ్రాసం అంటే రైతులకు గుర్తుకు వచ్చేది జొన్న, వరి, సజ్జ తదితర తృణధాన్యాలు. వీటిలో పశువులకు కావాల్సిన పోషకాలు లభించవు. పైగా వీటికి ఖర్చు అధికం. జీర్ణంకాని భాగం ఎక్కువే. శాస్త్రీయ పద్ధతిలో నాణ్యమైన పశుగ్రాసం పండించుకొని పశువులకు అందిస్తే ఆరోగ్యంగా ఉంటాయి. అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చు. పశుగ్రాసం సాగు ఖర్చు తగ్గించవచ్చు. డెయిరీ ఫారమ్‌ల నిర్వహణ వ్యయంలో 70 శాతం వరకు పశువుల మేతకే సరిపోతుంది. అందువల్ల మేత ఖర్చును తగ్గిస్తే అంత మేరకు లాభాలు పెంచుకునే అవకాశం ఉంది. మేత ఖర్చు తగ్గించడంలో పచ్చి మేతకు అధిక ప్రాధాన్యం ఉంది. అలాగే, పాలశీతలకీరణ అధికారులు పాలు సప్లయ్ చేసే రైతులకు 50 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందిస్తారు. పశుసంవర్ధక అధికారులు సైతం 50 శాతం రాయితీపై విత్తనాలు ఇవ్వనున్నారు. పశువుల కాపరులు వీటిని సద్వినియోగం చేసుకొని పశుగ్రాసం సాగు చేస్తే గడ్డి కొరత తీరుతుందని పశుసంవర్ధక శాఖ మొగుడంపల్లి మండల పశువైద్యులు డాక్టర్ నాగార్జున సూచించారు.

పశుగ్రాసం సాగు విధానం..

- పశుగ్రాసం విత్తనాల్లో ప్రధానమైనవి సూపర్ నైపర్, కో 1, కో 2, ఎస్ఎస్‌జీ–825 రకాలు
- 85 శాతం పచ్చిమేతను ఈ రకాల ద్వారా తీర్చుకోవచ్చు.
- ఒకసారి నాటితే 4 నుంచి 5 ఏళ్ల వరకు దిగుబడులను పొందవచ్చు.
- జనవరి నుంచి ఆగస్టు వరకు విత్తనాలు విత్తుకోవచ్చు.
- అన్ని రకాల నేలల్లో సాగు చేసుకోవచ్చు. ఆమ్లగుణాలు గల నేలల్లో అధిక దిగుబడి ఉంటుంది.
- పశుగ్రాసాల సాగుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించలేని వారు తోటలు, కూరగాయ పంటల్లో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు.
- ఎకరాకు 16 నుంచి 20 కిలోల విత్తనం అవసరం. మిశ్రమ పంటగా కూడా సాగు చేసుకోవచ్చు.
- దుక్కిలో 4 నుంచి 5 టన్నుల కంపోస్టు ఎరువు, 22 కిలోల యూరియా, 16 నుంచి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.
- విత్తిన 45 రోజుల తర్వాత ఎకరాకు 22 కిలోల యూరియా వేయాలి. ఎకరానికి 20 టన్నుల దిగుబడి వస్తుంది.
- అధిక విస్తీర్ణంలో సాగుచేసి సైలేజీ లేదా ఎండి గడ్డి రూపంలో నిల్వ చేసి వాడుకోవచ్చు.

పాల దిగుబడి ఎక్కువ..

- పశుగ్రాసాల సాగుకు తక్కువ శ్రమ,పెట్టుబడి అవసరమవుతుంది. విత్తనాలు నాటిన కొద్ది రోజుల్లోనే కోతకు వస్తుంది.
- పచ్చి మేతలు రుచికరంగా ఉండడం వల్ల పశువులు ఇష్టంగా తింటాయి. సులభంగా జీర్ణం చేసుకుంటాయి.
- పచ్చిమేత వల్ల పాల దిగుబడులు 25 శాతం వరకు పెరుగుతుంది. పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- దాణా అవసరం లేకుండా కేవలం పచ్చి మేత ద్వారా 5 నుంచి 6 లీటర్ల పాల దిగుబడి సాధించవచ్చు.
- పచ్చి మేతలో కాల్షియం, భాస్వరం వంటి మాంస కృతులతోపాటు ఏ,డీ,ఈ విటమిన్లు, పిండి, కొవ్వు పదార్థాలు అధికంగా ఉంటాయి.
- నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ పశుగ్రాసాలను సాగు చేసుకోవచ్చు.

మార్కెట్‌కు వెళ్లి వస్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి



ఘటనా స్థలంలో సూరజ్, ధర్మేందర్ మృతదేహాలు

పటాన్‌చెరుటౌన్: కారు బైకును ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కి చెందిన సూరజ్(22), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(28) ఇద్దరూ బతుకుదెరువు కోసం పటాన్‌చెరు వచ్చారు. చిన్న కంజర్ల గ్రామ పరిధిలో ఉంటూ స్థానికంగా ఓ పాల పరిశ్రమలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి బైక్‌పై సూరజ్, ధర్మేందర్ పటాన్‌చెరు మార్కెట్‌కి వచ్చి తిరిగి చిన్న కంజర్లకు వెళ్తున్నారు. ఐనోల్ గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని కారు వీరి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ దొంగలు అరెస్ట్

రాయపోలు(దుబ్బాక): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి నగదు, వెండి అపహరించిన వ్యక్తులకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాయపోలు ఎస్సై రఘుపతి తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాయపోలు మండల కేంద్రానికి చెందిన తుప్పతి అలియాస్ కల్లూరి లక్ష్మీ గత నెల 28న సమీప బంధువుల పెళ్లి నిమిత్తం మర్కూక్ మండలం పాముల పర్తికి వెళ్లారు. అదే రోజు రాత్రి ఆమె ఇంటి తాళం పగులగొట్టి దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారు గమనించి ఆమెకు సమాచారం ఇవ్వగా.. ఇంటికొచ్చి చూసేసరికి బీరువా పగులగొట్టి ఇళ్లంతా చిందరవందరగా బట్టలు పడేసి ఉన్నాయి. కుండలో ఉన్న రూ.60వేలతోపాటు అరకిలో వెండి అభరణాలు చోరీకి గురయ్యాయని మరుసటి రోజు 29న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా.. అదే గ్రామానికి చెందిన తప్పతి కనకయ్య, కుమ్మరి లింగలను అదుపులోకి తీసుకొని విచారించగా తామే దొంగతనానికి పాల్పడినట్టు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.32 వేల నగదు, అరకిలో వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.